

# గాలివానలో రెండ్రోజుల రైలుప్రయాణం

కె.వి.యస్.శర్మ

బెజవాడ ప్లాట్‌ఫారంమీద సర్కారు ఎక్స్‌ప్రెస్‌కోసం మా కుటుంబం నిలబడ్డాం. అది 1969 వ సంవత్సరం. దీపావళికింకా నాలుగురోజులుంది. బెజవాడలో ఓ పత్రికా సంపాదకుడు దీపావళి వెళ్ళగానే నా కచ్చున్న డబ్బు పంపిస్తానని మాటివ్వడంవల్ల (ముఖ్యంగా అది నిలబెట్టుకోకపోడంవల్ల) ఆ విషయం గుర్తుంది. ఆరోజు నవంబరు 4వ తేదీ అనుకుంటాను. నాకు సరిగ్గా గుర్తులేదు. బెంగళూరు నుంచి క్రితంరోజు బెజవాడవచ్చాం. ప్రస్తుతం తణుకువెళ్తున్నాం. అక్కడ నుంచి దీపావళికి మా వూరు విశాఖపట్నం వెళ్ళాలి. ఇది నిజమైన కారణం. కాని ఆంధ్రా యూనివర్సిటీవాళ్ళు ఇంటర్‌వ్యూకి పిలవటం అనే సాకు అందర్తోను చెప్పాను. ఆ ఉద్యోగం నాకెల్లాగో రాదు. ఆ ఉద్యోగం కోసం అక్కడ చాలామంది పడిగాపులుపడి వున్న అనుభజ్ఞులు, శక్తివంతులువున్నారు. అయినా ఇంటర్‌వ్యూకి రైలు ఖర్చు లివ్వక్కరలేదు కనుక అందర్నీ పిలవటం ఒక లాంఛనం. నాకు మంచిరోజు చూసుకుని ప్రయాణం చెయ్యటంమీద నమ్మకం లేకపోయినా, వెళ్తున్నది ఇంటర్‌వ్యూకి కనుక మంచిరోజు చూసుకునే బెంగుళూరులో బయల్దేరాను. (నాకు దేముడంటే నమ్మకం లేకపోయినా • ముఖ్యమైన పనులున్న రోజున దేముడికి దీపం పెడతాను!) అయినా గాలివానలో చిక్కుకున్నాను. ఎల్లాగో రైలు చార్జీలు పెట్టుకుని విశాఖపట్నం దాకా వెళ్తున్నప్పుడు దార్లో బెజవాడలో మా తోడల్లుడిని, తణుకులో మా బావమరిదిని చూసి వెళ్దామనుకున్నాం. సామాన్యదు

భారతదేశంలో రైలుఖర్చులు మాటిమాటికి పెట్టుకోలేదు కదా! అందుకని, బయల్దేరినప్పుడే నలుగురిని చూడాలన్న కోరిక తప్పించి దీపావళి ముందు అత్తవారి వూరు వెళ్ళి బట్టలుపెట్టించుకుందామన్న దురుద్దేశంలేదు, ఈ ప్రయాణంలో.

బెజవాడ రేడియో కేంద్రం, అప్పటికీ తుఫాను ఆరోజు కోస్తా ఆంధ్రప్రాంతానికి కొట్టొచ్చునని ఏడుగంటల వార్తలలో ప్రకటించింది. అయితే నేను తప్పకుండా రోజు వాతావరణ వివరాలు రేడియోలో విన్నా నాకు వాటిమీద నమ్మకంలేదు. అందుకని ఆరోజు తణుకు ప్రయాణం పెట్టుకున్నాను. ఎనిమిదింటికి రావాల్సిన రైలు తొమ్మిదైనా రాలేదు. ఆకాశంలో తెల్లని మేఘాలమధ్య నలుపు అక్కడక్కడ తెల్లని పత్తిలో నల్లని గింజలలాగ కనిపించటం మొదలుపెట్టింది. ఆగాగి చిన్న చినుకులు పడుతున్నాయి. వాన వచ్చేముందు మామూలుగావుండే ఉక్క మొదలైంది. నాకు కొంపలంటుకుపోతున్నట్టు, టైము లేనట్టు హడావిడిపడే వాళ్ళంటే జాలి. విధానంగా సాఫీగా నడిచే జీవితమంటే ఇష్టం. కాని రైళ్ళ ఆలస్యం అయినా, వస్తామన్న మనుషులు చెప్పిన టైముకి రాకపోయినా నాలో అసహనం అడ్డంలేకుండా పోతుంది. నా విసుగునుంచి దాక్కోటానికి ప్లాట్‌ఫారమ్‌మీద తల్లో పేలు చూసుకుంటున్న లంబాడిజనంమీదకి దృష్టి మరల్చాను. నాకు మానవ నాగరకతకు దూరంగా బతుకుతున్నందుకు వాళ్ళమీద జాలి కలిగింది. అల్లా అని మనం అలవరుచుకున్న శుష్కనాగరకతమీద నాకు గౌరవంలేదు. నా ద్వంద ప్రకృతి నాకే ఆశ్చర్యం కలిగిస్తుంది

పది గంటల ప్రాంతంలో దూరంగా సర్కారెక్స్‌ప్రెస్ కూత కూసింది. నేను శత్రువు మీదకి వురకటానికి సిద్ధంగావున్న వీరసైనికుడిలాగా అప్రమత్తతో నిలబడ్డాను రైలు రాగానే స్లీపరు కోచిలో సీట్లు సంపాదించాలి తెలుగుదేశం సంపన్నమనటంచేతో ఏమో కాని రైళ్ళలో చోటుండదు. నూరు మైళ్ళయినా, ప్రయాణం మామూలు మూడో తరగతి పెట్టెలో చేస్తే ఒళ్ళు విరిగిపోతుంది. సీటుకి పావలా డబ్బులు పారేస్తే స్లీపరు కోచిలో సుఖంగా ప్రయాణం చేయవచ్చు. తెలుగువాడి మాటల్లో ఈ డబ్బులు పారెయ్యటం అనే మాట చాలాసార్లు వినిపిస్తుంది. నాకూ అదే అలవాటు.

రైలాగటమే తడువు నేను హడావిడిగా రెండు అరల నిద్ర పెట్టెవైపు పరిగెత్తటం మొదలుపెట్టాను నా వెంట మా అరటిక్కెట్లు శారద, పద్మ పరిగెత్తాయి. వాళ్ళని వాళ్ళమ్మ దగ్గర వదిలేసి, ఆ అరక్షణంలో పిల్లల్నలా వదలద్దని తన్ని విసుక్కొని, తిరిగి పరిగెత్తుకు వెళ్ళి టి సి. మీద కెగబడ్డాను. 'అయ్యలారా! నాక్కాస్త గాలాడనిస్తే, నేను మీ అందరికి సీట్లు చూపిస్తాను. ఉక్కపోసి చస్తున్నాను. పైగా నా ప్రాణానికి ముతకగుడ్డలోటి' అని టి. సి. బతిమాలుపు, విసుగు సమపాళ్ళలో కలిపి అరిచాడు. దేముడున్నాడు, (లేడు!) అన్నప్పుడు ఏ విధంగా ఏకవచనం వాడుతామో అల్లాగే టి. సి., డ్రైవరు, స్టేషన్‌మాస్టరు మొదలైన సర్వనామాలకి కూడా వాడుతామేగాని అగౌరవంచేత కాదని గుర్తించమని ప్రార్థన.

ఇంతకు టి. సి. మా వాటాకి మూడు సీట్లిచ్చాడు. నలుగురు మనుషులం మూడు సీట్లలో సర్దుకు కూర్చోవాలి. నిజానికి అది రూల్సుకు వ్యతిరేకం. కాని మేము ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో టి. సి. మమ్మల్నెక్కనిచ్చాడు. అందుచేత నాకాక్షణంలో టి. సి. దేముడిలా కనిపించాడు. నామటుక్కి నేను మాత్రం రూల్సు ప్రకారం పోతాను. ఎవరికైనా విద్యార్థులకి మార్కులు తక్కువైతే ఛస్తే కలపను. కూలీ సామాను రైలెక్కించి కూలీ తీసుకుని వెళ్ళిపోయాడు. మాకు పెద్ద సామాను లేదు గాని, ఆ కాస్త సామాను పెట్టుకునే చోటు రైల్లో లేదు. ప్రతి ప్రయాణీకుడు తను బయల్దేరినచోటులో చవగ్గా దొరికే వస్తువులు, వెళ్ళేచోట దొరకనివి శక్తి కొద్ది కొని తీసుకువెళ్తా వుంటాడు. అందుకని రైల్లో చోటుండదు. కూలీలతో పేచీ. అందుకే నాకిల్లాంటి విష్టంలేదు. కాని మా వదినగారికి శీకాయి తీసుకు వెళ్ళకపోతే బావుండదని బెంగుళూరునుంచి శీకాయి తెచ్చి బెజవాడలో దింపాను. అక్కడ మా నాన్నగారికిష్టం అని మిరపపళ్ళు, గోంగూర వో బుట్టెడు కొన్నాను. మా బావమరిదికి బెంగుళూరునుంచి తీసుకెళ్తున్న ఇంగ్లీషుకూరల బుట్ట వుండనే వుంది. అందుకని సీట్లకింద ఇమడని ఈ బుట్టలు రెండూ కూర్చున్నవాళ్ళ కాళ్ళ దగ్గర సర్దేశాను.

బెజవాడనుంచి రైలిష్టం లేనట్టు నెమ్మదిగా ఈడ్చుకుంటూ కదిలింది. పెట్టెలో నేను, నా కుటుంబం స్థిమితంగా సర్దుకు కూర్చున్నాక రైల్లో అందరివేపు దృష్టి సారించాను. ఆరోజు ప్రయాణం చేసిన వాళ్ళ పేర్లు నాకు నిజంగా గుర్తులేవు. అందుకని వాళ్ళందరికి నాకు నచ్చిన పేర్లు పెడుతున్నాను. వాళ్ళలో ఎవరైనా ఇది చదివే అదృష్టం ఈ రచనకి పడితే నన్ను క్షమిస్తారని నమ్ముతున్నాను. ఇంతకూ మా పక్కసీట్లల్లో రామారావు, అతని భార్యా, రెండేళ్ళ పిల్లాడు వున్నారు. వాళ్ళ కళ్ళల్లో చేతల్లో ఒకరిపట్ల ఇంకొకళ్ళ అభిమానాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. వాళ్ళ భీమవరం వెళ్తున్నారు. ఎదురు సీట్లలో గుంటూరు మెడికల్ కాలేజీ అమ్మాయిలు శాంత,సుబ్బలక్ష్మి, రాణి కూర్చుని వున్నారు. శాంత పరమశాంతంగా పొడుగ్గా కనిపించింది. సుబ్బలక్ష్మి బొద్దుగా అమాయకంగా కనిపించింది రాణి సన్నగా పొట్టిగా చలాకీగా కనిపించింది. రాణి ఆకివీడు వెళ్తోంది, శాంత రాజమండ్రి, సుబ్బలక్ష్మి కాకినాడ వెళ్ళాలి. బహుశ వాళ్ళీపాటికి డాక్టర్లయివుంటారు. వాళ్ళ మాటల్లో స్టూడెంటు ఎన్నికలు, స్ట్రైకులు, అబ్బాయిలు ఆడపిల్లలపట్ల చూపించే శ్రద్ధాసక్తులు, దొర్లిపోతున్నాయి. ఆ మాటల్లో ఆ శ్రద్ధాసక్తులు అవతలివాళ్ళు చూపిస్తున్నందుకు గర్వం, 'ఎందుకు చూపిస్తున్నారో!' అని తెలియనట్టు ధ్వనించగల ఆడపిల్లలకి సహజమైన గడుసుతనం వున్నాయి ఇంతకు వాళ్ళ కాలేజీ స్ట్రైకువల్ల కాబోలు మూసేసారని అన్నారు. విద్యార్థులు స్ట్రైకు చెయ్యటానికి కారణాలు ఏవైనావుండొచ్చు. (ప్రిన్సిపాలు మనవడికి బారసాలైనప్పుడు పేరుపెట్టడం విషయంలో విద్యార్థుల్ని సంప్రదించలేదన్న కారణాలలాంటివి) నేను విశాఖపట్నంలో ఎ. వి. యన్. కాలేజీలో చదువుకునే రోజుల్లో నాకో సెక్రటరీ ప[illegible]

కోసారి పరిగెత్తుకొచ్చి 'లాస్ట్ ఇయరీపాటికి మూడు స్ట్రైకులు జరిగాయి. మనం వెంటనే స్ట్రైకు చేయించకపోతే పరువు దక్కదని' తేల్చాడు. మరో పావుగంటలో గోవాగురించి విశాఖపట్నం లో మేము స్ట్రైకుచేశాం, గోవాదాకావెళ్ళి పోట్లాడే ఓపిక లేక.

రైలు గుడివాడలో ఆగింది. మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. చినుకులు పడటం జోరైంది. రామారావు 'కాఫీ తేనా?' అని భార్య నడిగాడు. తెమ్మంది. ఇద్దరు తెల్లపాంటూ తెల్లచొక్కా అబ్బాయిలు ఎదురుసీట్లోవున్న ఆడపిల్లల్ని కాఫీ కావాలా అని అడిగారు. వీళ్ళు వద్దన్నారు. నేను మా ఆవిడని అడిగాను. 'కాఫీ తాగుతావా?' అని. తనకి రైలుస్టేషన్లో కాఫీ తాగటం ఆముదం తాగటంతో సమానమన్న అభిప్రాయం వుంది. అందుకని వద్దంది. నేను ఖరగ్‌పూర్ మెస్సులో ఏడాది భోంచేశాను అందుకని సర్వభక్షకుడిని కాఫీకోసం కిందకి దిగాను. కాఫీ తాగాక జామపళ్ళు కనిపిస్తే కొన్నాను. ఆ పళ్ళూ, బెంగుళూరునుంచి వస్తుంటే స్నేహితులు పిల్లలకి కొన్న బిస్కెట్లూ, ఆ రాత్రికి భోజనాలవుతాయని అప్పుడను కోలేదు కొన్నప్పుడు కేవలం తెలుగు జామకాయలమీద ప్రేమకొద్దీ కొన్నాను బెంగుళూరులో జామకాయలు లేకకాదు. మన జామకాయల రుచి వేరు! ఆతేడా 'మన'లో వుంది. జామకాయలు కొని రైలెక్కాను. అప్పటికి తెల్లచొక్కా తెల్లలాగూల అబ్బాయిలు కాఫీలు తీసుకొచ్చి 'తెచ్చేసాం కదా! తీసుకోండి!' అంటూ ఆడపిల్లల చేతుల్లో కాఫీగ్లాసులు పెట్టేసి వాళ్ళసీట్లదగ్గర కెళ్ళిపోయారు. వాళ్ళవలా వెళ్ళగానే 'మొన్న ఎలక్షన్లో ఓట్లేసినదగ్గరనుంచి నీళ్ళకి మనం అంటే శ్రద్ధ పెరిగిపోయింది' అంటూ నవ్వుకున్నారు అది హేళన కాదు అవతల వాళ్ళు తామంటే శ్రద్ధ చూపిస్తున్నారు అనేదానివల్ల కలిగిన గర్వంవల్ల జనించిన ఆనందం. చూడ్డానికి రెండు ఒక్కలా వుంటాయి. నాకు మనుషులను ఎనలైజు చేయడం సరదా! అందుకనే నాకు స్నేహితుడనేవాడు మిగలకుండా పోతూవుంటాడు! అయితే ఈ సరదావల్లే సుదీర్ఘ ప్రయాణాల్లో బోరు కొట్టదు, తగినంత మేత మెదడుకు లభిస్తుంది. ఏ అమ్మాయైనా 'ఈ అబ్బాయి నా వెంట పడుతున్నాడెందుకు!' అని జనాంతికంగా విసుక్కున్నదంటే 'ఓహో జనులారా! ఇతగాడు నా వెంట పడుతున్నాడు. గుర్తించండి! ఇతనికి చాలా మంచి అభిరుచి వుంద'ని అర్థం అని నా అభిప్రాయం.

రైలు గుడివాడ వదిలేసరికి జడివాన మొదలైంది. కిటికీలోంచి బయటికి చూస్తే వాన తప్పించి ప్రపంచం కన్పించలేదు. ఉన్నట్టుండి రైల్లో 'గాలివాన అంటగా' అందో ఆడగొంతు. అందరి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. 'ఈ వానలో మావాళ్ళు బండి తీసుకుని స్టేషన్‌కి రాకపోతే మా వూరెళ్ళటం ఎల్లా?' అని బయటికి ఆలోచించి రాణి భయంగా నవ్వింది. ఆ నవ్వు నాకు మా స్నేహితుడు రావును గుర్తుకు తెచ్చింది. అందుకని 'మీకు ఫలానా రావు చుట్టమా?' అని అడిగాను. మా ఆవిడ కళ్ళతో వురిమింది. అల్లాంటి సంభాషణ ఆడపిల్లలతో పరిచయం చేసుకోడానికి నేవాడే చిట్కా అని తన అభిప్రాయం. ఆ మాటే పెద్దన అన్నాడంటుంది నేను నిజానికి అల్లాంటి చిట్కాలు వాడనని కాదు కాని ఆ రోజు వాడలేదు. రాణిది కూడ మా ఆవిడ అభిప్రాయమే అనుకుంటాను. 'నా కెవరూ ఏమీ అవరన్న' ధోరణిలో జవాబిచ్చింది. మనదేశంలో ఆడవాళ్ళు ఆడవాళ్ళమని, మగవాళ్ళు మగవాళ్ళమని ప్రతిక్షణం గుర్తించుకుంటారు. మన సంఘం ఇటీవలి శతాబ్దాలలో అల్లా తయారైంది. ఇప్పుడు మనం అవలంబిస్తున్న కట్టుబాట్లను అలనాటి ఆర్యులు పాటించలేదన్న విషయం మనలో చాలామందికి తెలియదు. మనం పురాతనం అనుకునేదాని వేళ్ళు కొద్ది శతాబ్దాల క్రితానికి మాత్రమే వెళ్తాయి!

కైకలూరు జేరేసరికి పన్నెండు గంటలైంది. వాన కుండపోతగా కురుస్తోంది. పెద్ద పెద్ద చెట్లు ఊగుతున్నాయి. గాలి వత్తిడికి పెద్ద పెద్ద భవనాలే ఊగుతున్నాయి అని ఇంగ్లాండులో ఇంజనీర్లు హడావిడి పడుతున్నప్పుడు చెట్లెంత! అని అనిపించింది. తనకోసం వచ్చేవారిని సులభంగా పట్టుకోడంకోసం రాణి తనవైపు కిటికీ తెరిచింది. తెరిచిన తలుపులోంచి వాన, చలి పెట్టెలోకి ప్రవేశించాయి. రైలు పొడుగునా 'అమ్మాయి! అమ్మాయి!' అంటూ ఎవరో కేకపెడుతూ పరిగెత్తుతున్నారు. ఆ కంఠం గుర్తుపట్టి 'ఇక్కడ! ఇక్కడ' అంటూ రాణి వాన హోరులో అవతలిమనిషికి వినిపించేలా కేకపెట్టింది. వెతుక్కుంటూ వచ్చిన మనిషి కిటికీలోంచి సామానందుకున్నాడు. రాణి 'దారి బావుందా' అని అడిగింది. ఆయన 'ఏరు పొంగింది. నువ్వు ముందర దిగు' అంటూ వానలో తడుస్తూ తొందరపెట్టాడు. రాణి దిగింది. దూరంగా షెడ్డులో మోకాళ్ళపైకి గోచి పోసి చీర కట్టిన ఆడమనిషి, వెనక్కి వాల్చిన రెండెడ్ల బండి, ప్రపంచాన్ని నిర్లిప్తంగా గమనిస్తున్నట్టు నిలబడ్డ రెండెద్దులు పడుతున్న వానకి చెప్పని వ్యాఖ్యానంలా కనిపిస్తున్నాయి. బహుశ, రైలు తణుకు జేరేసరికి వాన తగ్గొచ్చు రైలు ఆరోజు తణుకు జేరదని నాకు అప్పుడనిపించలేదు.

రైలు ఆకివీడులో చాలా సేపు ఆగిపోయింది. ఆ స్టేషన్లో రైలాగినంతసేపు కిటికీలోంచి కనిపిస్తున్న దృశ్యం మారలేదు. రాణి ఆరోజు వాళ్ళ వూరు చేరిందో లేదో నాకు తెలియదు. రైలు కదిలేవరకు దూరంగా రాణి కనిపిస్తూనేవుంది. ఆ భయంకరమైన వానలో నెమ్మదిగా రైలుని ఈడ్చి వుండి చేర్చాడు డ్రైవరు అప్పటికి సాయంత్రం నాలుగుగంటలైంది. పొద్దున్న ఆరున్నరకి బెజవాడలో తిన్న ఇడ్లీలు ఎప్పుడో అరిగిపోయాయి. 'పిల్లలాకలేస్తోం దంటే బిస్కెట్లు పెట్టాం. రామారావు వాళ్ళ పిల్లాడికీ పెట్టాం. రైలు కదిలే సూచనలులేవు. అందుకని 'ఉండినుంచి భీమవరం నాలుగు మైళ్ళేకదా! దిగి జట్కాలో వెళ్తారా!' అని రామారావు నడిగాను. ఆయన జవాబు చెప్పేలోపల దూరంగా రోడ్డుమీద జట్కా గాలికి తిరగబడింది. రామారావు జవాబు చెప్పాల్సిన పనిలేకపోయింది.

అయిదుగంటలకి కూడా రైలు కదలలేదు. వాన తగ్గలేదు. గాలి హెచ్చింది. పెద్ద పెద్ద చెట్లు వేళ్ళతోసహా పెళ్ళగింపబడుతున్నాయి, విరిగిన పెద్దకొమ్మలు

# గాలివానలో...

రెండూ వచ్చి మా కిటికీదగ్గర పడ్డాయి. అవి ఆ గాజు కిటికీమీదపడివుంటే...! అందుకనే ఇనప రెక్కలు దింపాం. 'ఈ లెక్కన కాకినాడ వెళ్లేసరికి రెండో మూడో అవుతుం దేమో!' అని సుబ్బలక్ష్మి బెంగపెట్టుకుంది. 'మరి నా మాటేమిటి? నాకోసం ఎవరూ రైలుకికూడా రారు. నేనివాళ బయల్దేరినట్టు మా వాళ్లకి తెలియదు. రాజమండ్రి రైలుస్టేషన్‌లో ఆడవాళ్లు వంటరిగా జాగారం చెయ్యటమంటే నీకేమన్నా అయిడియా వుందా?' అని అడిగింది శాంత. రైళ్లు సకాలంలో జేరకపోతే వంటరిగా ప్రయాణంచేసే ఆడవాళ్ళ భయాలు నాకారోజు బాగా అర్థమయ్యాయి. సుబ్బలక్ష్మి అయిదునిముషాలకోసారి బెంగ దాచుకోకుండా బయటికి చూపిస్తూనే వుంది. శాంత తప్పిచూసి ధైర్యం తెచ్చుకోమని పెద్దరికం మీదేసుకుని అంటూనే వుంది. 'కాకినాడ వెళ్లేసరికి నిజంగా ఆలస్యం అయ్యేటట్టేవుంది' అని మొదట్లో సుబ్బలక్ష్మిని నేను ఆటలు పట్టించినా, చివరికి అందులోని నిజమైన బెంగ భయం అర్థమయ్యాక సిగ్గుపడ్డాను. దయ్యాల గురించి భయపడే వాళ్ళదగ్గర దయ్యాలకబుర్లు, దేముళ్ళకి, బాబాలకి భయపడే వారిదగ్గర నాస్తికత్వపు కబుర్లు చెప్పటం నాకు సరదా! వీటి విషయంలోకూడా నిజంగా భయపడ్డ వాళ్ళు కన్పించినప్పుడు అల్లా మాట్లాడి, ఆ తరువాత అల్లా మాట్లాడినందుకు సిగ్గుపడ్డానేమో!

ఆరుగంటలయినా సిగ్నల్ వాలలేదు. రైలు కదలలేదు. చీకట్లు ముసురుకున్నాయి. కొద్దికొద్దిగా రైలు ఊగటం మొదలైంది. చీకటిలాంటి భయం మా అందరి మనస్సుల్లో విస్తరించటం మొదలైంది. రామారావు లేచి లైటు వెయ్యబోయాడు. లైటు వెలగలేదు. పక్క సొరుగులో ముసలావిడ భయంతో సన్నని ఏడుపు సాగించింది 'భయంలేదు' అని భయపడ్డవాళ్ళే ఆవిడకు అభయం ఇస్తున్నారు. దీంతో బేజారై 'ఈ జన్మలో కాకినాడ వెళ్ళను' అంది సుబ్బలక్ష్మి. 'మేమందరం ఇళ్లు చేరితే నువ్వు చేరతావు' అంది శాంత. శారద, పద్మ ఓకలన్నారు. మా ఆవిడ జామకాయలు ఎక్కడ పెట్టిందో ఆ చీకట్లో కనిపించలేదు. 'నాన్నగారూ! లైటు బాగుచెయ్యరా?' అని మా పిల్లలు నన్నడిగారు. నేను శని ఆదివారాలలో స్కూటర్‌తోను, అత్తవారింట్లో కాలక్షేపం కోసం పాడైన ఫాన్లతోను, కుస్తీపట్టడం వాళ్లు చాలాసార్లు చూసి వుండటంచేత, వాళ్ళకి నా ఇంజినీరింగ్ స్కిల్ మీద చాలా నమ్మకం. వాళ్ళకి కుస్తీపట్టడానికి బాగుచెయ్యటానికి గల తేడా తెలియదు. మానవ ప్రయత్నం చేయడంకోసం లేచాను. నా దగ్గర స్క్రూడ్రైవరన్నా లేదు అందుకని మీసాల కత్తెరతీసి స్విచ్‌బోర్డు విప్పాను. నా తిప్పలు చూసిన మధ్యవయస్కుడొకాయన టార్చిలైటు వేసాడు లైటు తాలుకూ లైవ్‌వైరు కన్పించలేదు. ఫాన్ వేసి చూసాను. ఫాన్ తిరిగింది. కత్తెరతో ఫాన్ స్విచ్‌ని లైటు స్విచ్‌ని కలిపాను. లైటు వెలిగింది. ప్రజలమ్మయ్యన్నారు. కాని ఆ కత్తెర ఎంతసేపలా పట్టుకుని నిలబడగలను! ఎదురుసీటమ్మాయిలు తల పిన్నులిచ్చారు. అవి టెన్షన్‌కి ఎగిరిపోయాయి. రామారావు తన పెట్టెకి కట్టిన తీగముక్క తెంపి ఇచ్చాడు. దాన్ని జాగ్రత్తగా ముడేసాను. లైటు ఆరకుండా వెలిగింది! అందుకనే ఇప్పుడెప్పుడు ప్రయాణం చేయాల్సివచ్చినా పటకారు, స్క్రూడ్రైవరు తీసుకువెళ్తూ వుంటాను.

టార్చిలైటు పట్టుకున్నాయన తను రైల్లో లేబర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్టు పరిచయం చేసుకున్నాడు. 'స్లీపర్ కోచ్‌లో రెండోభాగంలో కూడా లైట్లు వచ్చే ఏర్పాట్లు చెయ్యగలవా ?' అని అడిగారు. సరేనన్నా తుప్పు పట్టిన, భారత రైల్వే వారి స్క్రూలు నా మీసాల కత్తెరకి లొంగలేదు. ఆ భాగంలోను రైల్లో చాలా పెట్టెలలోను ఆ కాళరాత్రి చీకటు గట్టిగా కరిచి పెట్టుకున్నాయి. ఆ రోజు సిగెరెట్లు కాల్చేవారిని ఎవరూ విసుక్కోలేదు. గీసే అగ్గిపుల్లలు కాలే సిగెరెట్లు ప్రసాదించిన వెలుగు తప్ప వెలుగు లేదు. ఉన్న ఒకటి రెండు టార్చిలైట్లు అత్యవసర పరిస్థితుల్లో బయటికి వస్తున్నాయి.

రాత్రి ఎనిమిది గంటలకి రైలు బాగా ఊగటం మొదలుపెట్టింది. ఆ ఊగుడు తగ్గాలంటే గాలికి అడ్డు తొలగాలి. అంటే తలుపులు తెరవాలి. అందుకని పరిగెత్తుకు వెళ్ళి ఆ కంపార్టుమెంటు తలుపులు తెరిచాను. అంత పెద్ద రైల్లో రెండు తలుపులు తెరిచినా మూసినా ఒకటేనన్న విషయం నాకు తట్టలేదు. ఆ ప్రయత్నం ఏటిలో ఈదేవాడు అలిసిపోయి గడ్డిపరక పట్టుకోడానికి పడే తాపత్రయం లాంటిది. నా కంత చిన్న విషయం తట్టకపోడం, నాకు ఎలా భయంవేసివుండి వుండటంచేత అనిపిస్తుంది ఇప్పుడు. తీసిన తలుపులగుండా రివ్వున గాలి దూసుకుపోయింది. గాలి శబ్దం మరింత భయంకరంగా విన్పించింది.

తొమ్మిదిగంటలకి గాలి ఉధృతం తగ్గింది. ప్రయాణీకులు నెమ్మదిగా పంజరాల్లోంచి కిందకి దిగారు. స్టేషన్లో కిరసనాయిలు దీపాలు వెలుగుతున్నాయి గార్డు, డ్రైవరు, స్టేషన్ మాస్టరు, నాకు పరిచయమైన లేబర్ ఆఫీసర్ సమావేశం అయ్యారు. ఫోను పలకటంలేదు ఏం చెయ్యాలని ప్రశ్న. స్టేషన్‌మాస్టరు రైలు వదలనన్నాడు. ప్రయాణీకులు ఏడుపు మొహాలుపెట్టారు. అప్పుడు డ్రైవరు ముందుకొచ్చాడు 'నేను మావాళ్లు ఇంజను తీసుకుని శివరావుపేట వెళ్లి పర్మిషన్ తీసుకొస్తా'నన్నాడు. ఆ క్రితం సంవత్సరం ఉప్పుగుండూరుదగ్గర రెండువైపులనుంచి (గాలివానకి టెలిఫోను తీగలు తెగిపోయినప్పుడు) రైళ్లను ధైర్యం చేసి వదిలారుట. అవి గుద్దుకున్నాయిట. అప్పటినుంచి ఇంజనుమాత్రమే అల్లాంటి పరిస్థితుల్లో నెమ్మదిగా ముందుస్టేషన్‌కి వెళ్లి అటువైపునుంచి రైలు వదలమన్న హామీ తీసుకుని వెనక్కివచ్చి రైలు తీసుకువెళ్లాలన్న నియమం ఏర్పరచారుట. పుండి మేష్టారొప్పుకున్నాడు. మాలో ఆశ మళ్లీ తలెత్తింది. ఇంజను నాలుగు మైళ్లు ఎంతట్లో వెళ్లివస్తుందని, ఇంజనువెళ్లిన అరగంట దగ్గరనుంచి ఎదురు చూడ్డం మొదలుపెట్టాం. గంటయినా ఇంజన్ జాడ కనిపించలేదు. మాలో ఒకతను సిల్కు పైజామా, ఉంగరాల వేళ్ళవాడు. 'ఈ రైల్వేల్ని...నమ్మటానికి వీల్లేదు. మన్నిక్కడ వదిలేసి వీళ్ళంతా భీమవరంలో వెచ్చగా బజ్జున్నట్టున్నారు' అని అనుప్రాసం వ్యక్తపరిచాడు. రైల్వే వాళ్లంటే ప్రజలకున్న అభిమానంకి నిదర్శనంగా అందరూ అతనితో ఏకీభవించారు. అతన్ని చూస్తుంటే


సినిమానటుడు పద్మనాభం గుర్తొచ్చాడు నాకు. అందుకని అతనికి పద్మనాభం పేరు పెట్టుకున్నాను. ఇంతకూ పద్మనాభం మాటలకి నా మనస్సు బాధపడింది. నా దగ్గర చుట్టాలంతా రైల్వేలో పన్చేస్తున్నారు. బహుశ అతనివాళ్ళెవరూ రైల్వేలో పన్చేస్తూ వుండరు తను చెందని వర్గం గురించి మనుషులెపుడూ దురభిప్రాయ పడుతూనే వుంటారు!

రాత్రి పదకొండుగంటలకి ఇంజను వెనక్కొచ్చింది. మేలుకునివున్న పదిమందిమి డ్రైవరిని చుట్టుముట్టాం. అతని ఆర డుగుల విగ్రహం నాకింకా బాగాగుర్తుంది. అతను ఆరెండురోజులు చిరునవ్వు మొహం మీదనుంచి జారిపోకుండా నిలుపుకున్నాడు. అతను చెప్పిన విషయాల సారాంశం ఏమిటంటే పట్టాల మీద నీళ్ళున్నాయట. ముందు పట్టాలున్నాయో ఊడాయో తెలియని పరిస్థితుల్లో ఇంజన్‌ని నెమ్మదిగా నడుపుకుంటూ ముందుకుపోయాడుట శివరావు పేటలో అటు వైపు నుంచి వచ్చిన ఇంజను కలిసిందిట. వాళ్ళు 'మీరు కనీసం స్టేషన్లో అయినా ఉన్నారు మేం రెండు స్టేషన్లమధ్య చిక్కడ్డాం'అని చెప్పారుట తెల్లారేవరకు రైళ్ళు తీసుకురావద్దని శివరావుపేట మేష్టరన్నాడుట. ఆఖరికి 'తెల్లారగానే అయిదునిముషాల్లో శివరావు పేట జేరుస్తాను. మీకేం భయంలేదు. హాయిగా నిద్రపోండి' అని చిరునవ్వుతో హామీ ఇచ్చాడు ఆరోజున మా కతనే శ్రీకృష్ణపరమాత్ముడు.

సరే చేసేదేముందని రైలెక్కాను. ఆడవాళ్ళెవరూ పైబర్తుల పైకెక్కలేదు. రెండింట్లో ఒకదానిమీద రామారావు పడుక్కున్నాడు. రెండోది ఖాళీగావుండటంచేత నేను పైకెక్కాను. పిల్లలుపడుక్కున్నారు. ఆడవాళ్ళు కూర్చుని నిద్రపోతున్నారు. రెండింటికి నేను కిందకి దిగి పద్మనాభాన్ని పడుకోమన్నాను. నిజానికి ఎవరికీ నిద్ర పట్టి చావలేదు. పడుతుందేమోనన్న ఆశ పక్కసొరుగులో ముసలావిడ శోకాలు రాత్రంతా ఆగాగి వినపడుతునే వున్నాయి. అందరికి ఏడవగల ధైర్యం వుండదు ఏడుస్తే అందరు నవ్వుతారని భయం.

తెల్లారేసరికి గాలి, వాన రెండూ లేవు. కాని నిన్న అవి చేసిన భీభత్సం అల్లాగే వుంది. నేను, లేబరు ఆఫీసరు, గార్డు, రైలు మీద పడ్డ కొమ్మలు నరుకుతున్న గాంగు కూలీలకు సాయపడ్డాం. నెమ్మదిగా జనం ఒక్కొక్కళ్ళే రైలు దిగటం మొదలెట్టారు. కొంతమంది 'మా రైలివాళైనా వదుల్తారా ?' అని స్టేషన్ మాస్టర్ని అడిగారు. వాళ్ళ వుద్దేశం ఆయనకి వదలటం ఇష్టంలేక నిన్న వదలేదని కాదు. ఇవాళ పరిస్థితు లెల్లావున్నాయో తెల్సుకోవాలన్న ఆత్రం కాని ఆ మాట విని ఆయన కస్సుమన్నాడు 'మీ రైలు కదిల్తేగాని ఈ స్టేషన్లో ఎవరికి మోక్షం లేదు ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలెల్లా వున్నారో చూసుకోలేదు. మీ రైల్నెప్పుడు సాగనంపి చేతులు కడుక్కుందామా అని వుంది' అన్నాడు. 'వెళ్తారుండీ! ఇంకో గంటలో బయల్దేరమూ!' అన్నాడు లేబర్ ఆఫీసర్. 'నేను భీమవరానికి మరో గంటలో బండీ చేరుస్తాగా' అన్నాడు డ్రైవరు. చేసేదేమిలేక పళ్ళు తోముకుని రైలెక్కాను.

కాస్సేపటికి లేబర్ ఆఫీసర్, పద్మనాభం రైలు పొడుగునా 'ఇంజన్లో నీళ్ళు పొయ్యాలి పహిల్మానులందరు దిగిరండి' అన్న పిలుపిచ్చాడు. నేను దిగబోతుంటే వాళ్ళకి కావల్సింది పహిల్మానులని మా ఆవిడ గుర్తుచేసింది. నన్నెవరైనా బలహీనుల్లో కాని, ఆడంగి వాళ్ళలోకాని లెక్కవేస్తే నాకమితమైన కోపం వస్తుంది. మా ఆవిడ కేసి కళ్ళురిమి చూసి రైలు దిగాను. రాత్రంతా ఇంజన్ పనిచేస్తూ వుండటంచేత ఇంజన్లో నీళ్ళయిపోయాయని, అందుకని కొంచెం నీళ్ళు కష్టపడి పోస్తే భీమవరం వెళ్ళి నీళ్ళు పూర్తిగా పట్టుకుని డ్రైవరు వస్తాడని పద్మనాభం దార్లో చెప్పాడు. దారి పొడుగునా పద్మనాభం ఇంజన్ సిబ్బందిని పొగుడుతునే వున్నాడు. నిన్న రైలువాళ్ళందరిని జమిలిగా తిట్టిన వాడితనేనా అనిపించింది. మేము ఇంజన్ దగ్గర కెళ్ళేసరికి కొంతమంది అప్పటికే నీళ్ళు పోస్తున్నారు. అది సినిమాల్లో చూపించే విధంగా వుంది. మనుషులు వరుసగా నిలబడి నీళ్ళ బిందెలు చేతుల్లోకి అందించుకుంటున్నారు. ఇంజన్‌లో నీళ్ళ టాంకు, పట్టాల మీదనుంచి ఏ పదిహే నడుగుల ఎత్తులోనో వుండటంచేత అక్కడ మనుషులు రెండు మూడు మెట్లుగ నిలబడి ఎత్తి పోస్తున్నారు. వాళ్ళని గుర్తుపట్టాను, డ్రైవరూ అతని సిబ్బందిను. నేను పద్మనాభం 'మేం అక్కడ నిలబడతాం' అని చెప్పాము. దానికి వాళ్ళు నవ్వి 'మాకీ కష్టమైన పని అలవాటే. అలవాటు లేని వాళ్ళు చేస్తే నడుములు పట్టేస్తాయ'ని చెప్పారు. లేబర్ ఆఫీసర్ 'జడ్జిగారూ! జనం వచ్చారు. మీరు ఇంక రెస్టు తీసుకోండి' అనటం విని అటు చూసాం. ఒక చారల పైజామా ఆయన ఏభై ఏళ్ళవాడు



కనిపించాడు: ఈ నీళ్ళు పోయటం అయిడియా ఆయన్దే నన్నారెవరో. లేకపోతే భీమవరంనుంచి స్పేరింజను వచ్చేసరికి ఆలస్యం అవుతుందని, 'మనమే నీళ్ళుపోసి మం ఇంజన్నే పంపిస్తే పోలా!' అన్నాడుట. మాకంటే ముందర వచ్చిన వాళ్ళని రిలీజ్ చేసాం.

మనుషులు సరిపడేలా లేరు అందుకని చేతిలోవున్న నీళ్ళబిందె పరిగెత్తి పక్కాడి కందించి అక్కడున్న ఖాళీబిందె ఇటువాడి కందించాలి. నీటిగుంటదగ్గర నీళ్ళముంచే చోట పద్మనాభం, గట్టుదగ్గర ఇటో కాలు అటో కాలువేసి నేను నిలబడ్డాం. ఎన్నివందల బిందెలో పోసినట్టనిపించింది. నడుమునొప్పి పుట్టింది. నా చెప్పులు తెగి పోయాయి. పద్మనాభం జారిపడి సిల్కు పైజామాకి బురదరంగు తెచ్చుకున్నాడు. అయినా అతను పని మానలేదు. అతన్ని ఆ కితంరోజు ఎంత తప్పుగా అంచనా వేసు కున్నాను! అతను వళ్ళు విరిగేలా పని చేయటం చూస్తే అతడికి రైల్వేవాళ్ళంటే ఎక్కడా చెడ్డ అభిప్రాయంవున్నట్టు అని పించలేదు. బహుశ అతన్ది దుడుకు స్వభావ మేమో! క్లిష్టపరిస్థితుల్లోగాని మనిషి లోని నిస్స్వార్థం, మంచితనం బయటపడ వనుకుంటాను 'ఇంక చాలు' అన్నాడు డ్రైవరు గాంగుకూలీలు ఆ బిందెలు స్టేషన్ మాస్టరింటికి చేర్చారు. ఆ బిందె లకి సొట్టలు పడ్డాయి! ఇంజను విడివడి భీమవరం బయల్దేరింది.

నేను ప్లాట్‌ఫారమ్మీద పచార్లు చేస్తున్నాను. ఎవరో కుర్రాడు జంగిడిలో పునుకులు అణాకొకటి పావలాకైదు అమ్ము తున్నాడు. అవో అర్ధరూపాయివి కొన్నాను. రామారావు వద్దన్నాడు. సుబ్బలక్ష్మి శాంతా చెరొకటి తీసుకున్నారు. మిగిలినవి మా కుటుంబం తీసుకున్నాం. ఇంకో అరగంటకి అదే కుర్రాడు రూపాయికి నాలుగు ఒడ్డాలు అమ్మటం మొదలుపెట్టాడు. అవో రెండ్రూపాయలవి కొన్నాను. నీళ్ల మోయని వెయ్యిమందిలోకాక మోసిన ముప్ఫైమందిలో వుండటం, ఒడ్డాలు కొనని వెయ్యిమందిలోకాక కొన్న ముప్ఫై మందిలో వుండటం మా ఆవిడకి నచ్చలేదు. 'మీరు కూడా మిగిలినవాళ్ళలా ఎందు కుండరు ?' అంటుంది. సంసారమనే కారుకి వుండితీరాల్సిన బ్రేకులు భార్యలు. ఆ ఒడ్డాలు మా సారుగులో అందరికి పంచాను. ఎనిమిదిన్నర ప్రాంతంలో ఓ ముసలమ్మ మూడు రాళ్ళు పెట్టి ఓ పావుసేరు పాలతో రెండు చెంచాల టీ పొడితో రైలందరికి టీ గాచింది. నేనది తాగటానికి ప్రయ త్నించి భంగపడ్డాను. చార్మినార్ సిగరెట్టు పెట్టె పావలాకి కొని నేను పద్మనాభం కాల్చాం. ప్లాట్‌ఫారమ్ మీద అమ్మొచ్చిన వన్నీ కొంటూ వుండగా ఇంజన్ వచ్చింది. భీమవరంలో అతి కష్టంమీద స్టేషన్ మాస్టర్ నీళ్ళు పట్టుకోడానికి వప్పుకున్నా డుట.

తొమ్మిదిన్నరకల్లా శివరావుపేట జేరాం. రామారావు దంపతులు దిగిపోయారు. శాంతా వాళ్ళ కాలేజీ అబ్బాయిలు దిగారు. అక్కడ తాగటానికి వడకట్టుకుంటే పనికి వచ్చే నీళ్లున్నాయి. ఆనాడు ఆ స్టేషన్ మెట్ల మీద జారిపడి, ఇప్పటికి పోని మోకాలు నొప్పి సంపాదించాను. లేబర్ ఆఫీసర్ నన్ను చూసి స్టేషన్‌మాష్టరు గదికి తీసుకువెళ్ళాడు. అక్కడికి ఇద్దరు బట్టలు బిళ్ళ కందువావేసుకున్న ఒక బుంగి మీసాలాయన వచ్చాడు. ఆయన ఆవూళ్ళో రైసుమిల్లుల యజమానుల సంఘానికి ప్రెసిడెంటో మరోటోనట. ఆయన రైల్లో అందరికి ఉప్మాచెయ్యటానికి కావల్సిన సరుకులు ఓ రెండు సంచీలతో తెచ్చాడు. వేడి వేడి ఉప్మామాట తల్చుకోగానే నోరూరింది. ఫలాహారశాల కుర్రాడికి అది చేసే పని అప్ప గించారు 'రెండు డబ్బులు చేసుకునే సైమలో మాకీ దర్మాలెల్లా కుదుర్తాయి పెద్దింటి మారాజులు ఆళ్ళిళ్ళల్లో చేయించి పట్టుకొస్తే పోలా?' అని దూరంగా వెళ్ళి గట్టిగా సణుక్కున్నాడు. ఉత్సాహవంతులు ఊళ్ళో కాఫీలకి బయల్దేరారు. ఎంత దూరం వెళ్ళినా హోటళ్ళు తెరిచిలేవు పాల సప్లై లేదుట. హోటళ్ళల్లో పని చేస్తున్నవాళ్ళ ఇళ్ళు కూలిపోయాయిట. వాళ్ళు పన్లోకి రాలేదుట. నే నుత్తినే కాస్సేపు రోడ్లమీద తిరిగాను.

ఆ సమయంలో ఏదో జీవకారుణ్య సంఘంవాళ్ళు రైల్లో బన్నులు పంచి పెట్టారుట. శారద పద్మ తింటున్నారు. నాకు ఇంజన్లో నీళ్ళు పోసి అలిసిపోడంచేత చాలా ఆకలి వేస్తోంది. పంచిపెడుతున్న అబ్బాయిల్ని అడిగి తెచ్చుకోడానికి మొహ మాటం వేసింది. కాస్సేపుట్టినే కూర్చుని రైల్లో అందరి దవడలు ఆడటం చూసాక ముష్టివాడిలా అడగటానికే నిశ్చయించు కున్నాను. తీరా అక్కడికి వెళ్ళాక మళ్ళీ మొహమాటం వెయ్యటం మొదలుపెట్టింది. ఆ అబ్బాయిలు చుట్టూ నాల్గయిదు ప్రద క్షిణలు చేసి ఆఖరికి అడిగి ఓ బన్ను తెచ్చు కున్నాను అతను వీడేమిటి ఇంత రేకిగా అడుగుతున్నాడు అన్న భావం చూపించ లేదు. ఆ రోజు అతను నాలాటి వాళ్ళని చాలామందిని చూసి వుంటాడు. అది తిని ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తున్నాను. ఫలాహారశాలవాళ్ళు ఉప్మా తయారైందని చెప్పారు.


రై. మి. య. సం. ప్రెసిడెంటుగారు, కలెక్టరుగారు అవి పంచిపెట్టడానికి వస్తు న్నారన్న విషయం బయటపెట్టాడు. ఫొటోగ్రాఫర్లు కూడా వస్తారు కాబోలు! ఆ ఆకలి సమయంలో కలెక్టర్లకోసం మంత్రులకోసం ఆగటం నాకిష్టం లేదు. 'ఫలానావాళ్ళు ఫలానా దానం చేసారు. ఫలానా ఆయన స్వయంగా పంచిపెట్టారు'— ఒ. వి. అన్న వార్త పేపర్లలో పడటానికి కదా ఈ తాపత్రయం అనిపించింది. ఏ హడావిడి లేకుండా పంచిపెట్టబడ్డ బన్ను లకి, బోల్డంత హడావిడితో పంచిపెట్ట బడబోతున్న ఉప్మాకి ఆకలి తీర్చటంలో ఏ తేడా లేదు కదా! అనుకున్నాను. కాని ఇప్పుడనిపిస్తోంది, ఒకళ్ళో మంచి పని చెయ్యటానికి కారణం ఏదైనా, మంచి పని మంచి పనేనని. కలెక్టరుగారొచ్చారు. ఆయన నిరాడంబరంగానే ఉన్నాడు. నాకు మొట్టమొదట్లో ఈ హడావిడిపట్ల వున్న విముఖత చివర్లో నేను నన్ను ముఖ్య ప్రయాణీకుల్లో ఒకరిగా కలెక్టరు. రికి పరిచయం చెయ్యడంవల్ల అనుకుంటాను నా వ్యతిరేకత నీరసించింది పంచి పెట్ట బడడం పూర్తయ్యాక మిగిలినవాటిలో ఓ నాలుగు పొట్లాలు లేబర్ ఆఫీసర్ నాచేతి కిచ్చారు మా కుటుంబానికి ఓ రెండుంచు కుని మిగిలిన రెండూ సుబ్బలక్ష్మికి శాంతకి ఇచ్చాను.

పదిన్నర ప్రాంతంలో సుబ్బలక్ష్మి శాంతల

కాలేజీ మగపిల్లలు ఓ గంట క్రితంవరకు మాతో ప్రయాణంచేసిన అబ్బాయిలు వాళ్ళ ఇళ్ళనుంచి కారియర్లలో అన్నం తెచ్చారు. వీళ్ళ పిన్న ఆ మగపిల్లలు వీళ్ళ అవసరాలు కనుక్కున్నందుకు గర్వంగా నవ్వుకున్నారు. ఈ రోజు వాళ్ళు అపేక్షగా తెచ్చిన అన్నాన్ని వీళ్ళు కృతజ్ఞతతో స్వీకరించారు. రైల్లో వెళ్తున్న చెల్లాయికి ఆఫీసుకు సెలవుపెట్టి అన్నం తీసుకువెళ్ళిన అన్నయ్యపట్ల ఆ చెల్లాయి చూపించే అనురాగం లాంటిది శాంత సుబ్బలక్ష్ముల కళ్ళలో చదివాను. ఇది కేవలం నా భావం కావచ్చు. ఆ క్షణం మామూలుగా మనుషులలో వుండే మలినం పోయి స్వచ్ఛమైన నీరులా మెరిసినక్షణం. 'మీరనవసరంగా శ్రమపడ్డారన్నా'రు వీళ్ళు. 'ఇందులో శ్రమేముందన్నా'రు వాళ్ళు 'ఇప్పుడే వస్తాం' అంటూ బయటికి వెళ్ళారా అబ్బాయిలు. ఆడపిల్లలు 'మేము రెండు కారియర్ల అన్నం తినలేం. ఒకటి మీరు తీసుకోండి' అన్నారు వాళ్ళు మా ఆవిడతో. 'అవి మీకోసం తెచ్చారు. మీరు మీ వూరు చేరేసరికి ఎన్ని గంటలవుతుందో ఉంచండి' అంది మా ఆవిడ. సుబ్బలక్ష్మి జాలిగా చూసింది. శాంత 'మీ పిల్లలకైనా పెట్టండి మేమూ తినం' అంది. వాళ్ళ పిల్లలకని ఇచ్చిన భోజనం పిల్లలు తినగా మిగిలింది. అది రాత్రివరకు వుంచటం ఎందుకు ఎలాగో రెండు గంటల కల్లా తణుకు వెళ్తాం కదా అని మిగిలిన అన్నం నేను మా ఆవిడ చెరో ముద్దా తిన్నాం. శాంతావాళ్ళ స్నేహితులు వచ్చి కారియర్లు తీసుకువెళ్ళారు. పిల్లలకన్నం పెట్టగలిగినందుకు మా ఆవిడ సంతోషించింది.

తిండి తినేసరికి అందరికి కాలకృత్యాలు గుర్తుకొచ్చాయి. ఒక్క పెట్టెలోను నీళ్ళు లేవు. ఈ విషయం నేను డ్రైవరుతో చెప్పాను. 'భీమవరం జంక్షన్‌లోగాని నీళ్ళు లేవు. ఆ స్టేషన్‌మాస్టరేమో రైలు తీసుకుని అక్కడికి రావద్దంటున్నాడు. ఇప్పటికే ఆయన రెండు రైళ్ళని వుంచుకున్నాడు' అన్నాడు డ్రైవరు లేబర్ ఆఫీసర్‌తో చెప్పాను. ఆయన స్టేషన్‌మాస్టరుతో చెప్పాడు. ఎవరూ చేసేదేంలేదు. రై. మి. య సం. ప్రె. 'మా శిపులో మీరూ డ్రైవరు, కలెక్టరుగారు రండి వెళ్ళి చెప్దాం' అంటూ లేబర్ ఆఫీసర్‌ని తీసుకుని భీమవరం జంక్షన్ బయల్దేరాడు. ఈ రాయబారం విజయవంతమైనా ఆ జంక్షన్ స్టేషన్ మాస్టర్ 'నా పీకలమీదకి మరో రైలొద్దు బాబూ!' అంటూ కాళ్ళ పట్టుకున్నంత పని చేసాడుట. వినేదెవరు! ఆయన్నేత బలవంతంగా ఒప్పించారు. మా రైలు బయల్దేరింది. అర్జునుడు మూకం జెండాడు నప్పుడు కర్ణాదులు అడ్డు రారు అని కృష్ణుడు దుర్యోధనుడితో చెప్పినట్టు, దార్లో లేని భీమవరం జంక్షన్‌కి సర్కార్ ఎక్స్‌ప్రెస్ వెళ్ళటంవల్ల ఏదైనా పొరపాటు వచ్చివుంటే, అధికారులు శివరావుపేట, భీమవరం జంక్షన్ల స్టేషన్‌మాస్టర్లని నిలదీసినప్పుడు (దేముడి దయవల్ల రాలేదు!) రై.మి.య సం.ప్రె. లు అడ్డు రారు కదా! అయినా ఆ క్షణంలో మాకు రై.మి య. సం.ప్రె. ఆదులు దేముళ్ళలాగా రెండో ఆయన కర్కోటకుడిలాగా కనిపించాడు. ఈ రోజున అప్పటి నా అభిప్రాయాలు ఎంత తప్పో నాకు తెలుసు. భారతప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమైన శిలలు రూల్సు. అవి చాలా ఖచ్చితంగా కాకుండా సందిగ్ధంగా (అంబిగ్యుటస్) వుంటాయి. అవి బలవంతులకి వీలుగాను, బలహీనులకి ఇబ్బందిగాను వుంటాయి. అందుకనే మన దేశంలో ఏ రూలుకే అర్థమో కోర్టుకెళ్ళే దాకా తెలియదు. ఉదా: రైలు చెయిన్ లాగటం. ఇర్రిపాపర్ యూస్‌కి జరిమానా అని అందరికీ తెలుసు. ప్రయాణికుల్లో నూటికి ఒకరికి కూడా ప్రాపర్‌యూస్ ఏమిటో తెలియదు. అదే సంపన్నదేశాలలో ఇది చెయ్యచ్చు. ఇది చెయ్యకూడదు అని కచ్చితంగా వాళ్ళ దగ్గరనుంచి అప్పేసిన కాయితాలిస్తారు. మనదేశం ఆ స్థాయి కెదగాలి! ఆ శుభదినం ఎప్పుడో!

రైలు భీమవరం జంక్షన్ చేరింది. పెట్టెలకి నీళ్ళ పట్టారు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఆ వూరి కాలేజీ రేకులు ఎగిరిపోటంచేత కాలేజీ మూసేసారుట. ఇళ్ళకిపోయే పిల్లలు మా పెట్టె నిండా ఇరవైమంది ఎక్కారు. 'హాయిగా రేపు బయల్దేరలేకపోయారా?' అని అడిగాను. 'ఈ రైలు ఇవాళో రేపో మా వూరు తప్పకుండా వెళ్తుందండే. రేపు మరో రైలు రాకపోవచ్చండే' అని జవాబిచ్చి వాళ్ళ కబుర్లలో పడిపోయారు. ముగ్గురు ఆడపిల్లలు కూడా వున్నారా గుంపులో. 'ఈ రైలు ఏ అర్ధరాత్రో మీ వూరెళ్తే మీకు బయం లేదా?' అని అడిగాను. 'మా వూళ్ళో మాకు బయంమేమిటండే!' అని జవాబిచ్చారు వాళ్ళు. వాళ్ళని చూస్తుంటే ముచ్చట వేసింది. వీళ్ళ ధైర్యం చూసి సుబ్బలక్ష్మి కాస్త పుంజుకున్నది. ఆ పిల్లలు మాకు ఆలోచనకి తావివ్వకుండా పెట్టెను కబుర్లతోను, పాటలతోను, హాస్యాలతోను



# రామదూత — ధర్మపథం —



### — బులుసు వెంకటరమణయ్య

✷ సీతాదేవిని వెతకడంకోసం సుగ్రీవుడు వానరులను నాలుగు దిక్కులకూ పంపినా, ముఖ్యులైన హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు మున్నగువారిని దక్షిణ దిక్కుకే పంపాడు. ఆమెను రావణుడు తీసికొనిపోవడంవల్లనూ, లంకలోనే ఆమెను ఉంచివుండవచ్చుననే ఊహతోనూ అలా పంపవలసి వచ్చింది. ఇంతేకాకుండా శ్రీరామునికి హనుమంతుడిపై దృఢమైన విశ్వాసం ఉన్నది. సీతాదేవి యెక్కడవున్నా, తెలిసికొని, ఆమెకు తమ వృత్తాంతంచెప్పి ధైర్యం చెప్పగలడనే నమ్మిక రామునికి ఉండడంవల్లనే, హనుమంతుని చేతికి తన ముద్రికను గుర్తుగా ఇచ్చి తన దూతగా పంపిఉన్నాడు.

హనుమంతుడు నెరవేర్చవలసిన దౌత్యం స్త్రీజనంతో. అది సామాన్యులకు సాధ్యపడేది కాదు. అటువంటి రాయబారికి అవసరమైన లక్షణాలన్నీ హనుమంతునికి ఉన్నవి. అవి ఏవనగా—

'బ్రహ్మచారీ బలీ ధీరో
మాయావీ మానవర్జితః;
ధీమానుదారో నిశ్శంకో
వక్తాదూతః స్త్రియాం భవేత్'

స్త్రీల విషయంలో దూతగా పంపబడేవాడు బ్రహ్మచర్యనిష్ఠకలవాడై ఉండాలి. గొప్పబలమూ, ధైర్యమూ అతనికి ముఖ్యమైనవి. అతడు మాయలు ఎరిగి ఉండాలి. మానాభిమానాలు విడిచి, ఎట్టి అవమానాన్నయినా సహించాలి. అతడు గొప్పబుద్ధి, త్యాగమూ కలిగి ఉండాలి. సందేహం ఉండకూడదు. నేర్పుగా మాటలాడగలిగివుండాలి— అని దీని భావం.

హనుమ బ్రహ్మచర్య నియమంకలవాడు కాబట్టి, స్త్రీల నడుమ సీతను వెతకవలసినప్పుడు—నిద్రావస్థలో పెక్కువిధాల మనస్సును చలింపజేసేటట్టు వారు ఉన్నా, అతని మనస్సు చలించలేదు.

గొప్పబలమూ, ధైర్యమూ లేకపోతే ఒంటరిగాడైన తాను క్రూరులైన రాక్షసుల నడుమ ప్రవేశించే సాహసం అతనికి ఉండనే ఉండదు.

రాక్షసులు మాయావులు: వారి మాయలను ఎదించే మాయలు పన్ని, తన శరీరాన్ని హ్రస్వంగానూ, దీర్ఘంగానూ—సమయానుకూలంగా చేయగల్గి ఉండబట్టే వారికి లొంగకుండా హనుమ తన తలచిన కార్యాన్ని సాధించగలిగాడు.

మానాభిమానాలు విడిచి ఉన్నందు వల్లనే కార్యవాది అయిన అతడు రాక్షసులు చేసిన అవమానాన్ని సహించాడు.

అతడు బుద్ధిమంతుడు కాబట్టే తొందరపడకుండా, సీతాదేవికి తన్ను గురించి ఏ విధంగా — ఎప్పుడు తెలియజేయాలో ఆలోచించి, శ్రీరాముని కథతో ఉపక్రమించాడు.

గొప్ప వక్త అగుటవల్లనే రావణుని దగ్గర ఎలా మాటలాడవలెనో, ఆ రీతిగా మాటలాడి, స్వామి కార్యంలో ఎంత త్యాగానికయినా సిద్ధపడి తన ఉదారభావాన్ని ప్రకటించాడు.

అసంఖ్యాకులైన రాక్షసులతో యుద్ధం సంభవించినప్పుడు గెలువగలనో, లేదో అనే సందేహం లేకుండానే వారితో తలపడి విజయం సాధించాడు.

ఇట్టి హనుమంతుడు రామదూత! చూచి రమ్మంటే—కాల్చి వచ్చిన ఘనుడు! ●

## గాలివానలో ...

నింపేసారు. ఆ రెండు రోజుల్లో మాకప్పుడే నవ్వు గుర్తొచ్చింది. ఆ క్రితం రోజు మాతృదేవత రిలీజైందిట. చూద్దామని వెళ్తే సినిమాహాలు రేకు లెగిరిపోయాయిట. ఈ రోజు పెట్రోలు ఇంజన్తో ఆటెయ్యాలని చూస్తున్నారుట. ఊళ్ళో ఎక్కడా కరెంటు లేదుట.

సాయంత్రం ఏడుగంటలకి రైలు బయల్దేరింది. ముందు ఇంజన్ వెళ్ళి అనుమతి తీసుకుని వెనక్కి వచ్చి రైలును తీసుకు వెళ్ళడం చేసింది. తణుకు చేరేసరికి రాత్రి పదైంది. ఊరంతా చిమ్మచీకటి. ఎల్లాగైతేనేం వందమైళ్ళు ముప్ఫై ఆరు గంటలు ప్రయాణంచేసి చేరాం. అక్కడ టికెట్ కలెక్టర్ చేతిలో అడగకపోయినా టికెట్లు పెట్టి బయటపడ్డాం. మైలు దూరం రిక్షా కట్టడానికి రిక్షావాడు రూపాయన్నర అడిగాడు. స్టేషన్లోవున్న రిక్షాలే ఒకటో రెండో! వాళ్ళ ఇళ్ళు కూలిపోయి వుంటాయి. ఆ టైములో బేరం ఇష్టం లేక రిక్షా ఎక్కాం. మా ఆవిడ బండి బయల్దేరాక ఆ గిరాకీకి అర్థం అడిగింది. 'అవునమ్మా, మామూలుగా అయితే అర్ధ రూపాయే. కాని ఇయాల ఒటేలులో కాఫీ నీళ్ళు పావలాకి అమ్మారు. ఆళ్ళకి పాలోస్తే, వాళ్ళు లీటరు నీళ్ళు రెండ్రూపాయల కమ్మారు. ఆళ్ళ గొడ్లకి గడ్డిమ్మినోరు డబల్రేటు కమ్మారు. ఓడి దగ్గరా డబ్బు మిగల్లేదు' అని ఆర్థికశాస్త్రంలోని ముఖ్యాంశాల్ని తన భాషలో వివరించాడు. ఓ భారత దేశపు భారీ వ్యాపారి! నీకది పర్వదినం! మరో లక్ష గడించు!

కోప్పడ్డప్పుడు కోప్పడ్డా మెచ్చుకునేటప్పుడు మెచ్చుకుంటేనే, మెచ్చుకునేటప్పుడు మెచ్చుకున్నా కోప్పడేటప్పుడు కోప్పడితేనే ప్రభుత్వశాఖలు సరిగా పన్చేస్తాయని నా నమ్మకం. ఆ రెండ్రోజులు నవ్వు చెరగని మొహాలతో నిబ్బరంగా, ఎదిగిన వ్యక్తిత్వాలతో నిబద్ధ రైల్వే సిబ్బందికి, ఆకలెరిగి తిండి పెట్టిన దాతలకి గౌరవంతో ఈ రచన అంకితం చేస్తున్నాను. అవకాశం వచ్చింది కదా అని ఏ మాత్రం దేశభక్తి లేకుండా లాభాలు చేసుకున్న వ్యాపారస్థులకి కాదు! ●